నేటి మ్యాచ్
పాకిస్థాన్ X నెదర్లాండ్స్
మ. 2.00 నుంచి
వేదిక: హైదరాబాద్

చెల్లుకు చెల్లు..

వన్డే ప్రపంచకప్ తొలి పోరులో ఇంగ్లండ్‌పై జయభేరి

- బదులు తీర్చుకున్న న్యూజిలాండ్
- కాన్వే, రచిన్ అజేయ శతకాలు

అహ్మదాబాద్: పుష్కర కాలం తర్వాత భారత్ ఆతిథ్యమిస్తున్న వన్డే ప్రపంచకప్‌నకు అదిరిపోయే ఆరంభం లభించింది. గత ఫైనలిస్ట్‌ల మధ్య గురువారం జరిగిన తొలి పోరులో న్యూజిలాండ్ 9 వికెట్ల తేడాతో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌ను చిత్తుచేసింది. బజ్‌బాల్ ఆటతో ప్రత్యర్థులను బెంబేలెత్తించడమే పనిగా పెట్టుకున్న ఇంగ్లిష్ జట్టుకు.. కివీస్ ప్లేయర్లు గట్టి కౌంటర్ ఎటాక్ ఇచ్చారు. బ్యాటింగ్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై టాస్ గెలిచిన న్యూజిలాండ్ కెప్టెన్ ఛేదనకు మొగ్గు చూపాడు. ఫలితంగా మొదట బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 282 పరుగులు చేసింది. మాజీ కెప్టెన్ జో రూట్ (77; 4 ఫోర్లు, ఒక సిక్సర్) హాఫ్ సెంచరీతో రాణించగా.. కెప్టెన్ జోస్ బట్లర్ (43; 2 ఫోర్లు, 2 సిక్సర్లు), బెయిర్‌స్టో (33; 4 ఫోర్లు, ఒక సిక్సర్) పర్వాలేదనిపించారు. ఇంగ్లండ్ ప్లేయర్లంతా డబుల్ డిజిట్ స్కోరు చేసి రికార్డు నెలకొల్పినా.. మంచి ఆరంభాలను భారీ స్కోర్లుగా మలచడంలో విఫలమయ్యారు. కివీస్ బౌలర్లలో మ్యాట్ హెన్రీ 3, ఫిలిప్స్, శాంట్నర్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో న్యూజిలాండ్ 36.2 ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి 283 పరుగులు చేసింది. కాన్వే (121 బంతుల్లో 152 నాటౌట్; 19 ఫోర్లు, 3 సిక్సర్లు), రచిన్ రవీంద్ర (96 బంతుల్లో 123; 11 ఫోర్లు, 5 సిక్సర్లు) అజేయ శతకాలతో చెలరేగిపోయారు. బంతి ఎక్కడ పడ్డా దాని గమ్యస్థానం బౌండ్రీనే అన్నచందంగా ఈ జంట పరుగుల సునామీ సృష్టించడంతో.. మరో 82 బంతులు మిగిలుండగానే న్యూజిలాండ్ జయకేతనం ఎగరవేసింది. ఇంగ్లండ్ బౌలర్లో సామ్ కరన్ ఏకైక వికెట్ పడగొట్టగా.. 150 కిలోమీటర్లకు పైగా వేగంతో బంతులు వేసిన మార్క్ వుడ్ 5 ఓవర్లలో 55 పరుగులు సమర్పించుకున్నాడు. రచిన్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

గత ప్రపంచకప్ ఫైనల్లో ఎదురైన పరాజయానికి న్యూజిలాండ్ బదులు తీర్చుకుంది.

2019లో దూకుడు కొరవడి ఇంగ్లిష్ జట్టుకు అప్పనంగా వరల్డ్‌కప్ అందించిన కివీస్ ఈసారి ఆ దూకుడుతోనే డిఫెండింగ్ చాంపియన్‌ను దెబ్బకొట్టింది!

బంతిపై పగబట్టినట్లు.. బరిలోకి దిగింది బాదడానికి అన్నట్లు.. న్యూజిలాండ్ ప్లేయర్లు అహ్మదాబాద్‌లో వీరంగం ఆడారు!

కాన్వే, రచిన్ రఫ్ఫాటకు ఫీల్డర్లు ప్రేక్షకులుగా మారిపోగా.. బౌలర్లు తెల్లమొఖం వేశారు!!

వోక్స్, వుడ్, కరన్ ఇలా ఏ ఒక్క బౌలర్‌ను వదలకుండా ఈ జంట వీర బాదుడు బాదింది. ముఖ్యంగా పట్టుమని పది మ్యాచ్‌ల అంతర్జాతీయ అనుభవం కూడా లేని స్పిన్ ఆల్‌రౌండర్ రచిన్ రవీంద్ర.. విధ్వంస కాండ రచించాడు. పేరులో రాహుల్ ద్రవిడ్, సచిన్ టెండూల్కర్‌ను నిక్షిప్తం చేసుకున్న ఈ భారత సంతతి ఆటగాడు.. అందుకు తగ్గట్టే ద్రవిడ్‌లోని కళాత్మకత.. సచిన్‌లోని మాస్టర్ క్లాస్‌ను కలగలిపి విశ్వరూపం చూపాడు. ఇంగ్లండ్ ప్లేయర్లంతా కానా కష్టంతో చేసిన పరుగులను ఈ ఇద్దరే ఊదేశారు.

సంక్షిప్త స్కోర్లు

ఇంగ్లండ్: 282/9 (రూట్ 77, బట్లర్ 43; హెన్రీ 3/48, ఫిలిప్స్ 2/17),
న్యూజిలాండ్: 36.2 ఓవర్లలో 283/1 (కాన్వే 152 నాటౌట్, రచిన్ 123 నాటౌట్; సామ్ కరన్ 1/47).

1 వన్డే క్రికెట్ చరిత్రలో ఒక జట్టుకు చెందిన 11 మంది ఆటగాళ్లు రెండంకెల స్కోరు చేయడం ఇదే తొలిసారి. కివీస్‌తో పోరులో ఇంగ్లండ్ బ్యాటర్లంతా డబుల్ డిజిట్ నమోదు చేశారు.

3 ప్రపంచకప్‌లో శతకం బాదిన మూడో అతి పిన్న ప్లేయర్‌గా రచిన్ రికార్డుల్లోకెక్కాడు. కోహ్లీ, ఆండీ ఫ్లవర్ ముందున్నారు.

కసితీరా కొట్టిన కివీస్..

2019 జూలై 24న జరిగిన వన్డే ప్రపంచకప్ ఫైనల్లో ఇంగ్లండ్, న్యూజిలాండ్ హోరాహోరీగా తలపడ్డాయి. నిర్ణీత ఓవర్లలో ఇరుజట్లు 241 పరుగులే చేయగా.. విజేతను నిర్ణయించేందుకు నిర్వహించిన సూపర్ ఓవర్‌లోనూ స్కోర్లు సమమయ్యాయి. దీంతో మ్యాచ్‌లో ఎక్కువ బౌండ్రీలు కొట్టిన ఇంగ్లిష్ జట్టును విజేతగా ప్రకటించారు. అది మనసులో బలంగా ముద్రించుకున్న కివీస్ ప్లేయర్లు ఈసారి దెబ్బకు దెబ్బ కొట్టారు. ఇంగ్లండ్ ఆటగాళ్లు పరుగులు సాధించేందుకు తీవ్రంగా ఇబ్బంది పడ్డ చోట కాన్వే, రచిన్ ఇద్దరే 38 బౌండ్రీలతో విజృంభించారు.

కేసీఆర్ స్పోర్ట్స్‌కిట్స్ ఓ మైలురాయి

దేశానికి మన క్రీడా పథకాలు ఆదర్శం • సాట్స్ చైర్మన్ ఆంజనేయగౌడ్

చెన్నూర్ రూరల్: రాష్ట్రంలో ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించేందుకు విప్లవాత్మకంగా తీసుకొచ్చిన కేసీఆర్ స్పోర్ట్స్ కిట్స్ మైలురాయిగా నిలుస్తాయని సాట్స్ చైర్మన్ ఆంజనేయగౌడ్ పేర్కొన్నారు. గురువారం చెన్నూర్ మండల కేంద్రంలో జరిగిన కేసీఆర్ స్పోర్ట్స్ కిట్ల పంపిణీ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్‌తో కలిసి ఆంజనేయగౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'గ్రామీణ ప్రాంత యువత నిరంతరం క్రీడా కార్యక్రమాల్లో పాల్గొనే విధంగా ప్రతీ దగ్గర క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశాం. స్పోర్ట్స్ కిట్లను అందజేయడం ద్వారా యావత్ క్రీడా సమాజం హర్షం వ్యక్తం చేస్తున్నది. సీఎం కేసీఆర్ ఆలోచనలను క్రీడా విశ్లేషకులు ప్రశంసిస్తున్నారు. ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించేందుకు సీఎం చేపడుతున్న వినూత్నమైన, విభిన్నమైన పథకాలు ఉన్నత స్థాయిలో నిలబెట్టే విధంగా ఉన్నాయి. దేశంలో మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచేలా కేసీఆర్ స్పోర్ట్స్ కిట్స్ పథకం కచ్చితంగా నిలిచిపోతుంది' అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పాకిస్థాన్ X నెదర్లాండ్స్

- ఉప్పల్‌లో వరల్డ్‌కప్ మ్యాచ్
- మధ్యాహ్నం 2.00 నుంచి..

ఆజమ్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: వన్డే ప్రపంచకప్‌లో భాగంగా శుక్రవారం ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో నెదర్లాండ్స్‌తో పాకిస్థాన్ తలపడనుంది. ఇక్కడ జరిగిన గత రెండు వార్మప్ మ్యాచ్‌ల్లోనూ భారీగా పరుగులు చేసిన పాక్ జట్టు.. ఆ అనుభవాన్ని మెగాటోర్నీలో వినియోగించుకోవాలని చూస్తుంటే.. తొలి మ్యాచ్‌లోనే పెద్ద జట్టుకు షాక్ ఇవ్వాలని నెదర్లాండ్స్ భావిస్తున్నది. ఆసియాకప్‌లో పెద్దగా ఆకట్టుకోలేకపోయిన పాకిస్థాన్.. ప్రాక్టీస్ మ్యాచ్‌ల్లోనూ పరాజయం పాలైన విషయం తెలిసిందే. అయితే అనిశ్చితికి మారుపేరైనా పాకిస్థాన్ జట్టును అంచనా వేయడానికి లేదు. ఇమామ్ ఉల్ హక్, ఫఖర్ జమాన్ రూపంలో మంచి ఓపెనర్లు ఉండగా.. మిడిలార్డర్‌లో కెప్టెన్ బాబర్ ఆజమ్, వికెట్ కీపర్ మహమ్మద్ రిజ్వాన్ మంచి టచ్‌లో ఉన్నారు. ఉప్పల్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన పోరులో రిజ్వాన్ శతక్కొట్టగా.. ఆసీస్‌పై బాబర్ ఆజమ్ చక్కటి ఇన్నింగ్స్ ఆడాడు. ఇక హైదరాబాద్ వాతావరణం తమకు ఎంతగానో నచ్చిందని పదే పదే చెప్తున్న పాక్ ప్లేయర్లు.. రావల్పిండిని తలపిస్తున్న ఫ్లాట్ పిచ్‌పై నెదర్లాండ్స్‌ను చీల్చి చెండాడేందుకు సిద్ధం అవుతున్నారు. 'బౌండ్రీలు చిన్నవి కావడంతో.. బౌలర్లు ఏ ఒక్క తప్పిదం చేసినా మూల్యం చెల్లించుకోవాల్సిందే. భారీ స్కోర్లు ఖాయమే. అందుకు తగ్గట్లే ఆడాల్సి ఉంటుంది' అని పాక్ సారథి బాబర్ ఆజమ్ మ్యాచ్‌కు ముందు రోజే బౌలర్లకు హెచ్చరికలు జారీచేశాడు.

డచ్ జట్టులో విజయవాడ వాసి

క్వాలిఫయింగ్ టోర్నీ ద్వారా వన్డే ప్రపంచకప్‌నకు అర్హత సాధించిన నెదర్లాండ్స్ జట్టులో స్టార్ ప్లేయర్లు లేకపోయినా.. ఆ జట్టులోనూ ప్రతిభగల ఆటగాళ్లకు కొదవ లేదు. కెప్టెన్ స్కాట్ ఎడ్వర్డ్స్, మ్యాక్స్ డౌడ్, బాస్ డి లీడ్, విక్రమ్‌జిత్ సింగ్‌తో పాటు విజయవాడ వాసి తేజా నిడమనూరు కూడా మంచి ఆటగాడే. అయితే అతడికి తుది జట్టులో చోటు దక్కుతుందా లేదా అనేది చూడాలి. ఇప్పటి వరకు వరల్డ్‌కప్‌లో రెండు విజయాలు మాత్రమే సాధించిన నెదర్లాండ్స్ ఈ సారి బలమైన ముద్ర వేసేందుకు సన్నద్ధమై భారత్‌లో అడుగుపెట్టింది.

బాదుడే.. బాదుడు..

రామచరణ్, జూనియర్ ఎన్టీఆర్ కలిసి నాటు నాటు పాటకు డ్యాన్స్ వేసినట్లు..
రోజర్ ఫెదరర్, రఫేల్ నాదల్ కలిసి టెన్నిస్ డబుల్స్ మ్యాచ్ ఆడినట్లు..
అమితాబ్ బచ్చన్, రజినీకాంత్ ఒకే సినిమాలో నటించినట్లు..
చూస్తున్నది లైవ్ మ్యాచా.. లేక హైలైట్సా అని అనుమానం వచ్చేట్లు..
రచిన్ రవీంద్ర, డ్వైన్ కాన్వే ఇంగ్లండ్‌పై శివతాండవమాడారు!

రెండో ఓవర్ తొలి బంతికే విలియమ్ యాంగ్ గోల్డెన్ డక్‌గా వెనుదిరగగా.. ఇక అక్కడి నుంచి రచిన్, కాన్వే విధ్వంస కాండ ప్రారంభమైంది. బంతి ఎంత వేగంగా వస్తే.. దాన్ని అంతే వేగంగా బౌండ్రీకి తరలించాలని కంకణం కట్టుకున్నట్లు కనిపించిన ఈ జోడీ.. ఇంగ్లండ్ ప్లేయర్లకు కనీసం ఊపిరి తీసుకునే గ్యాప్ కూడా ఇవ్వకుండా చెలరేగిపోయింది. వీరి దూకుడుకు ప్రేక్షకులుగా మారిపోయిన ఇంగ్లిష్ ఆటగాళ్ల వద్ద కౌంటర్ ప్లాన్ లేకుండా పోయింది. మూడో స్థానంలో బరిలోకి దిగడం కొత్తే అయినా.. ఏమాత్రం తడబడకుండా పక్కా క్రికెటింగ్ షాట్స్‌తో చెలరేగిపోయిన రచిన్ వన్డే క్రికెట్‌లో తొలి శతకం తన పేరిట లిఖించుకోగా.. కాన్వే ఐపీఎల్ ఫామ్‌ను కొనసాగించాడు. గులాబీ మొక్కకు అంటు కడుతున్నట్లు.. ఇటుక మీద ఇటుక పేర్చి గోడ కడుతున్నట్లు.. ఎక్కడా అడ్డ దిట్ట షాట్ల జోలికి పోని ఈ ఇద్దరూ.. ఫీల్డర్ల మధ్య నుంచి కరెక్ట్‌గా కొలత వేసి కొట్టినట్లు బౌండ్రీలు రాబట్టారు. ఈ క్రమంలో అభేద్యమైన రెండో వికెట్‌కు వీరిద్దరూ రికార్డు స్థాయిలో 211 బంతుల్లోనే 273 పరుగులు జోడించి జట్టును సునాయాసంగా విజయతీరాలకు చేర్చారు. ఈ మ్యాచ్ వరకు న్యూజిలాండ్ మేనేజ్‌మెంట్ సంబురపడిపోయినా.. రెగ్యులర్ కెప్టెన్ విలియమ్సన్ కోలుకొని తిరిగి జట్టులోకి వస్తే రచిన్ కోసం ఎవరి స్థానానికి ఎసరు పెట్టాలనే కొత్త తలనొప్పి మాత్రం తప్పనిదే!

ఖాళీ ఖాళీగా..

వన్డే ప్రపంచకప్ ప్రారంభ సమరానికి అభిమానులు పోటెత్తుతారని భావించిన బీసీసీఐకి.. తీవ్ర నిరాశ ఎదురైంది. ప్రపంచంలోనే అతిపెద్ద స్టేడియంలో జరిగిన వరల్డ్‌కప్ ఆరంభ పోరుపై అభిమానులు పెద్దగా ఆసక్తి చూపలేదు. టీమ్‌ఇండియా బరిలోకి దిగకపోవడంతో పాటు.. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ఫ్యాన్స్ ప్రత్యక్షంగా మ్యాచ్ చూసేందుకు రాకపోయి ఉండవచ్చని స్థానిక అధికారులు పేర్కొన్నారు. నాలుగేండ్లకోసారి నిర్వహించే ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీని కనీస ఆరంభ వేడుకలు లేకుండా మొదలు పెట్టడం కూడా చేటు చేసి ఉండవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. వన్డేలకు ప్రభ తగ్గుతుందనే వాదనలు ఎక్కువవుతున్న నేపథ్యంలో 50 ఓవర్ల ఫార్మాట్ భవిష్యత్తుపై ఈ మ్యాచ్ మరిన్ని సందేహాలు లేవనెత్తింది. గత వరల్డ్‌కప్ ఫైనలిస్ట్‌లు పోటీపడ్డ పోరు ఆరంభంలో 1.32 లక్షల సామర్థ్యం ఉన్న అహ్మదాబాద్ స్టేడియంలో పట్టుమని పది వేల మంది కూడా కనిపించలేదు. న్యూజిలాండ్ బ్యాటింగ్ చేస్తున్న సమయానికి మైదానంలో ప్రేక్షకుల సంఖ్య 47 వేలకు చేరింది. దీనిపై గుజరాత్ క్రికెట్ సంఘం ప్రతినిధి మాట్లాడుతూ.. '50 నుంచి 60 వేల మంది అభిమానులు వస్తారని ఆశించాం. భారత్ బరిలోకి దిగకపోవడంతో ఫ్యాన్స్ స్టేడియానికి రాలేదు. ఎండ వేడిమి కారణంగా కూడా అభిమానులు ఎక్కువ ఆసక్తి చూపి ఉండకపోవచ్చు' అని వెల్లడించారు.

పతక గురి అదుర్స్

- ఆసియాగేమ్స్‌లో సత్తాచాటిన భారత ఆర్చర్లు
- కాంపౌండ్‌లో పసిడి జోరు
- స్క్వాష్‌లో స్వర్ణం, రజతం
- అంతిమ్ పంగల్‌కు కాంస్యం

ఆసియాగేమ్స్‌లో భారత ఆర్చర్లు దుమ్మురేపుతున్నారు. తమ గురికి తిరుగులేదన్న రీతిలో పతకాలు కొల్లగొడుతున్నారు. మహిళల, పురుషుల కాంపౌండ్ ఈవెంట్లలో కొరియా, చైనా, జపాన్ ఆర్చర్లను వెనుకకు నెడుతూ పసిడి వెలుగులు విరజిమ్మారు. తెలుగమ్మాయి వెన్నెం జ్యోతిసురేఖ, అదితి స్వామి, పర్నీత్‌కౌర్ త్రయం స్వర్ణం ఖాతాలో వేసుకోగా, అభిషేక్‌వర్మ, ఒజాస్, ప్రతమేశ్ పసిడి ముద్దాడారు. స్క్వాష్‌లో మన ప్లేయర్లు స్వర్ణ, రజతాలు దక్కించుకోగా, పురుషుల సింగిల్స్‌లో సెమీస్‌కు దూసుకెళ్లిన ప్రణయ్ సంచలనం సృష్టించాడు. ప్రత్యర్థిని మట్టికరిపిస్తూ అంతిమ్ పంగల్ కంచు మోత మోగించింది. మొత్తంగా పోటీల 12వ రోజు భారత్‌కు మూడు స్వర్ణాలు సహా రజతం, కాంస్యం దక్కాయి.

హాంగ్జౌ: ఆసియాగేమ్స్ ముగియడానికి వస్తున్నా భారత ప్లేయర్ల పతక జోరు టాప్‌గేర్‌లో దూసుకెళుతున్నది. నిన్న, మొన్నటి వరకు అథ్లెట్లు పతకాల పంట పండించగా, తాజాగా తమ వంతు అన్నట్లు ఆర్చర్లు రెచ్చిపోతున్నారు. తమకు బాగా అచ్చొచ్చిన కాంపౌండ్ ఈవెంట్‌లో తిరుగులేదని చాటిచెబుతూ మరో రెండు పసిడి పతకాలను ఖాతాలో వేసుకున్నారు. తొలుత మహిళల కాంపౌండ్ టీమ్ ఈవెంట్‌లో జ్యోతిసురేఖ, అదితి గోపీచంద్, పర్నీత్‌కౌర్‌తో కూడిన భారత త్రయం 230-229తేడాతో చైనీస్ తైపీ జట్టుపై అద్భుత విజయం సాధించింది. ముగ్గురికి ముగ్గురు చెక్కుచెదరని గురితో పాయింట్లు కొల్లగొడుతూ పోయారు. ఓవైపు చైనీస్ తైపీ ఆర్చర్లు దీటుగా పోటీనిచ్చినా పది పాయింట్లకు తగ్గకుండా రౌండ్ రౌండ్‌కు తమ ఆధిక్యాన్ని పెంచుకుంటూ పోయారు. మరోవైపు పురుషుల కాంపౌండ్ టీమ్‌ఈవెంట్‌లో అభిషేక్‌వర్మ, ఒజాస్ దేవ్‌తలె, పార్థ మేశ్ జాక్వర్ త్రయం 235-230తో దక్షిణకొరియా ఆర్చర్లపై చిరస్మరణీయ విజయాన్ని సొంతం చేసుకుంది. మొత్తంగా మూడు కాంపౌండ్ ఈవెంట్లలో భారత ఆర్చర్లు పసిడి పతకాలు కొల్లగొట్టి ఔరా అనిపించారు. ఆసియాడ్‌లో మన ఆర్చర్లకు ఇదే అత్యుత్తమ ప్రదర్శన కావడం విశేషం.

స్క్వాష్‌లో డబుల్ ధమాకా:

స్క్వాష్‌లో భారత్ డబుల్ ధమాకాతో అదరగొట్టింది. మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్లో దీపికా పల్లికల్, హరిందర్‌పాల్‌సింగ్ జోడీ 11-10, 11-10తో మలేషియా ద్వయం అజ్మాన్, మహమ్మద్ కమాల్‌పై విజయంతో పసిడి ఒడిసిపట్టుకుంది. మరోవైపు పురుషుల సింగిల్స్ ఫైనల్లో సౌరవ్ ఘోశల్ 1-3తో ఎయిన్ యో(మలేషియా) చేతిలో ఓడి రజత పతకం దక్కించుకున్నాడు.

పసిడి ఆశలు గల్లంతు

ఆసియా క్రీడల్లో పసిడి పతకమే లక్ష్యంగా బరిలోకి దిగిన భారత మహిళల హాకీ జట్టు ఆశలు గల్లంతయ్యాయి. గురువారం జరిగిన సెమీఫైనల్లో సవితా పూనియా బృందం చైనా చేతిలో 0-4తో చిత్తుగా ఓడిపోయింది. చైనా ఆటగాళ్లను నిలువరించేందుకు భారత డిఫెండర్లు ఎంతో ప్రయత్నించినా లాభం లేకపోయింది. జియాఖి ఘూంగ్ 25వ నిమిషంలో పెనాల్టీ కార్నర్‌తో చైనాకు తొలి గోల్ అందించింది. ఆ తర్వాత వరుసగా మీరాంగ్ జౌ (40వ నిమిషం), మేయు లియాంగ్ (55వ నిమిషం), బింగ్‌ఫెంగ్ గు(60వ నిమిషం)లో గోల్స్ చేశారు. భారత జట్టు చైనా గోల్‌పోస్ట్‌పై పలుమార్లు దాడి చేసినా విజయవంతం కాలేకపోయింది. కాంస్య పతకం కోసం భారత్ రెండో సెమీఫైనల్లో ఓడిన జట్టును ఢీ కొననుంది.

దాయాదితో పోరుకు సై

కబడ్డీలో భారత పురుషుల జట్టు వరుసగా నాలుగు విజయాలతో సెమీస్‌లో అడుగుపెట్టింది.భారత్ గురువారం 50-27తో చైనీస్ తైపీని ఓడించి పాకిస్థాన్‌తో పోరుకు సిద్ధమైంది.

అంతిమ్ పంగల్‌కు కంచు

మహిళల రెజ్లింగ్‌లో యువ సంచలనం అంతిమ్ పంగల్ కాంస్యంతో మెరిసింది. 19 ఏళ్ల అంతిమ్ 53 కిలోల విభాగంలో ఒలింపిక్ విజేత, మంగోలియా రెజ్లర్ బొలొర్తుయా బాట్ ఒచిర్‌ను 3-1తో చిత్తు చేసింది. క్వార్టర్స్‌లో జపాన్ క్రీడాకారిణి అకారి పుజిసమి చేతిలో అనూహ్యంగా ఓటమిపాలైన అంతిమ్ కాంస్య పతక పోరులో అదరగొట్టింది. మంగోలియా రెజ్లర్‌కు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా పతకం కొల్లగొట్టింది.

పతకాల పట్టిక

	దే	స్వ	ర	కా	మొ
1	చైనా	179	99	55	333
2	జపాన్	44	54	60	158
3	కొరియా	33	47	77	157
4	భారత్	21	32	33	86
5	ఉజ్బెకిస్థాన్	19	16	25	60

నోట్: దే-దేశం, స్వ-స్వర్ణం, ర- రజతం, కా-కాంస్యం, మొ-మొత్తం

41 ఏండ్ల కరువు తీర్చుతూ

భారత స్టార్ షట్లర్ హెచ్ఎస్ ప్రణయ్ ఆసియా క్రీడల్లో ప్రభంజనం సృష్టించాడు. పురుషుల సింగిల్స్‌లో సెమీఫైనల్‌కు దూసుకెళ్లి 41 ఏండ్లుగా ఊరిస్తున్న పతకం కొరత తీర్చాడు. 78 నిమిషాల పాటు ఉత్కంఠగా సాగిన క్వార్టర్స్‌లో ప్రణయ్ మలేషియాకు చెందిన లీ జీ జియాపై 21-16, 21-23, 22-20తో గెలుపొందాడు. దాంతో, 41ఏండ్ల తర్వాత పురుషుల సింగిల్స్ సెమీస్‌కు చేరిన భారత ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. 1982లో ఢిల్లీ జరిగిన పోటీల్లో సయ్యద్ మోడీ కాంస్యం గెలిచాడు. ఇప్పుడు ప్రణయ్ అతడి రికార్డును బ్రేక్ చేయనున్నాడు. ఫైనల్ బెర్తు కోసం ప్రణయ్ చైనాకు చెందిన లీ షీ ఫెంగ్‌తో తలపడనున్నాడు. డబుల్స్‌లో జోడీ సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి సింగపూర్ ద్వయంపై 21-7, 21-9తో అవలీలగా గెలిచి సెమీస్‌లో అడుగుపెట్టారు. తద్వారా పురుషుల డబుల్స్‌లో పతకం గెలిచిన రెండో భారత జంటగా సాత్విక్ - చిరాగ్ గుర్తింపు సాధించనున్నారు. 41 ఏండ్ల క్రితం.. 1982లో లెరోయ్ డిసా, ప్రదీప్ గంధే జోడీ కాంస్యం గెలిచింది. ఇక ఈ ఏడాది ఒక్క టైటిల్ కూడా గెలవని పీవీ సింధు క్వార్టర్స్‌లోనే ఇంటిదారి పట్టింది.

అజారుద్దీన్‌పై వేటు

హెచ్‌సీఏ ఎన్నికల్లో పోటీకి అనర్హత
ఏకసభ్య కమిటీ నిర్ణయం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: భారత మాజీ కెప్టెన్, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) మాజీ అధ్యక్షుడు మహమ్మద్ అజారుద్దీన్‌పై వేటు పడింది. మరో మారు ఎన్నికల్లో పోటీచేయాలనుకున్న అజర్ ఆశలపై సుప్రీం కోర్టు నియమిత జస్టిస్ లావు నాగేశ్వర్‌రావు నేతృత్వంలోని ఏకసభ్య కమిటీ నీళ్లు గుమ్మరించింది. ఏకకాలంలో హెచ్‌సీఏతో పాటు దక్కన్ బ్లూస్ క్లబ్ అధ్యక్షుడిగా అజర్ కొనసాగడాన్ని అనర్హతగా భావిస్తూ సస్పెన్షన్ వేసింది. దీంతో ఈ నెల 20వ తేదీన జరిగే హెచ్‌సీఏ ఎన్నికల్లో పోటీచేసేందుకు వీలు లేకుండా ఓటరు జాబితా నుంచి పేరు తీసివేసింది. జూలై 31, 2023 ఆర్డర్‌ను అనుసరించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు జస్టిస్ నాగేశ్వర్‌రావు..అజర్‌కు లేఖ ద్వారా స్పష్టత ఇచ్చారు. పరస్పర విరుద్ధ ప్రయోజనాలకు పాల్పడిన కారణంగా ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని ఆయన పేర్కొన్నారు.

తప్పైపోయింది.. క్షమించండి: స్వప్న బర్మన్

హాంగ్జౌ: ఆసియా క్రీడల హెప్టాథ్లాన్ పోటీల అనంతరం తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు భారత అథ్లెట్ స్వప్న బర్మన్ వెల్లడించింది. 'ట్రాన్స్‌జెండర్' వ్యాఖ్యలపై బేషరతు క్షమాపణలు చెబుతున్నట్లు గురువారం ప్రకటించింది. 2018 ఆసియా క్రీడల హెప్టాథ్లాన్‌లో స్వర్ణం నెగ్గిన స్వప్న.. ఈ సారి చైనా వేదికగా జరుగుతున్న ఏషియా గేమ్స్‌లో నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది. ఈ క్రమంలో కాంస్య పతకం నెగ్గిన తెలంగాణ గురుకుల అథ్లెట్ నందినిని ఉద్దేశిస్తూ.. 'ట్రాన్స్‌జెండర్‌తో పోటీ పడి పతకం కోల్పోయా. దయచేసి నా మెడల్ నాకు ఇప్పించండి' అని సోషల్ మీడియాలో రాసుకొచ్చింది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.